# కాంగ్రెస్ వచ్చేది లేదు.. ఇచ్చేది లేదు

- అబద్ధాలు చెప్పి అధికారంలోకి రావాలన్నదే కాంగ్రెస్ ఆరాటం
- పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నది బీఆర్ఎస్ మాత్రమే
- నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


ఎన్నికల ప్రచార అడియో పాటలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, అక్టోబర్ 28 : పదేండ్లుగా అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు.. అధికారం అందుకోవడానికి ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మోసపూరిత హామీలను నమ్మితే దౌర్జన్యమే దాపురిస్తుందని ప్రజలను హెచ్చరించారు. కల్హేర్ మండలం మిర్ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన కూలి నాందేవ్ సొంతంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నారాయణఖేడ్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలపై ప్రత్యేకంగా చేయించిన అడియో, పాటలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి కర్ణాటక ప్రజలు ఓట్లేస్తే అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ పథకాలను ఇంటింటికీ ఇస్తున్నట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ కార్యకర్తలకే పథకాలను మంజూరు చేసి, అర్హులకు తీవ్ర అన్యాయానికి గురి చేశారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ పథకాలు కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా పథకాల సంబంధించిన నిధులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు వివరించారు. ప్రజల సొమ్మును దొచుకుతిన్ని కాంగ్రెస్ పార్టీకి, ప్రజల సంక్షేమానికి పాటుపడే బీఆర్ఎస్ మధ్య నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. కాంగ్రెస్ ఇస్తామంటున్న 3 గంటలు కావాలా? బీఆర్ఎస్ ఇస్తున్న 24 గం టల కరెంటు కావాలో రైతులు ఆలోచించుకోవాలన్నారు. ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త సైనికులా శ్రమిస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఇంటింటికీ వివరించాలనే, ఇలాగే కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయొద్దో ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ గెలిస్తే పాత రోజులు వస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు అలీ, కల్హేర్ ఎంపీటీసీ సంగప్ప, బాచేపల్లి పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, రాపర్తి సర్పంచ్ శ్రావణ్‌కుమార్, ఎంబీఆర్ యువసేన నియోజకవర్గం అధ్యక్షుడు కిరణ్‌రావు పాటిల్, నాయకులు సంతోష్, అంజయ్యసరగ్, బాలయ్య, లక్ష్మయ్య, నీరుడు రవి, మౌలానా, కుమ్మరి విఠల్, శివరాంపల్లి రాజు, పొన్న సాయిలు, అన్నారావు, బొక్క సాయిలు, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# నమ్మితే 'కర్ణాటక' కష్టాలే

- కాంగ్రెస్ గ్యారంటీలకు మోసపోవద్దు
- ఆ పార్టీని నమ్మితే మీకూ కష్టాలే
- నారాయణఖేడ్‌లో కర్ణాటక రైతుల ప్రచారం
- ర్యాలీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ యత్నం


కాంగ్రెస్ వ్యతిరేక ప్లకార్డు ప్రదర్శిస్తున్న కర్ణాటక రైతులు

నారాయణఖేడ్, అక్టోబర్ 28 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలు తెలంగాణ ప్రజలు నమ్మి మోసపోవద్దు, ఇటీవల కర్ణాటకలో ఆపార్టీ హామీలను విశ్వసించి గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత గాలికొదిలేశారు.. ఇది సాక్షాత్తు కర్ణాటకకు చెందిన రైతులు, మహిళలు చెప్పిన నిజం. నారాయణఖేడ్‌లో శనివారం కర్ణాటకకు చెందిన సుమారు 200మంది రైతులు, మహిళలు జనజాగృతి పేరిట భారీర్యాలీ నిర్వహించారు. మంగల్‌పేట్‌లోని భవానీ ఆలయం నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా బసవేశ్వరచౌక్ వరకు కాంగ్రెస్ విస్మరించిన హామీల ప్లకార్డులు, ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ పాదయాత్ర చేపట్టారు. అనంతరం విలేకరుల సమావేశంలో బీదర్ జిల్లా రైతుసంఘం నాయకులు సంజీవ్‌కుమార్ టొళ్లే, దేవరాజ్ గౌడ, పెనినగౌడ, సోమనాథ్ తదితరులు మాట్లాడారు.

కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన ఐదు హామీలు సక్రమంగా అమలుకు కావడం లేదన్నారు. 8 గంటల విద్యుత్ ఇస్తామని కేవలం రెండు గంటలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికి నెలకు పది కిలోల బియ్యం ఇస్తామని, ఐదు కిలోలు ఇస్తుందని తెలిపారు. గృహలక్ష్మి పేరిట ప్రతి మహిళకు నెలకు రూ.2వేలు ఇస్తామని, ఇప్పుడు అనేక ఆంక్షలు పెట్టారన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇంకా ప్రారంభించలేదన్నారు. కర్ణాటకలో తాము మోసపోయిన విధంగా తెలంగాణ ప్రజలు మోసపోవద్దనే ఉద్దేశంతోనే జనజాగృతి యాత్ర చేపట్టి జాగృతం చేస్తున్నామన్నారు.

### రైతుల ర్యాలీపై కాంగ్రెస్ అక్కసు

కర్ణాటక రైతులు చేపట్టిన యాత్రపై కాంగ్రెస్ కార్యకర్తలు అక్కసు వెళ్లగక్కారు. మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి నివాసం వద్దకు ర్యాలీ చేరుకోగానే అక్కడ ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారిగా దూసుకొచ్చారు. రైతుల చేతిలోని ప్లకార్డులు, ఫ్లెక్సీలను లాక్కుని చించివేసి దౌర్జన్యం చేశారు. రాజీవ్‌చౌక్ వద్ద రైతులపై దాడికి యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు.



నారాయణఖేడ్ పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద ప్రదర్శన చేపట్టిన కర్ణాటక రైతులు, మహిళలు

# 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను'

- సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్
- సంగారెడ్డి పట్టణంలో ఓటర్ల అవగాహన 'బైక్' ర్యాలీ
- ఈ నెల 31 వరకు ఓటు నమోదు
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి


సంగారెడ్డి పట్టణంలో బైక్‌ర్యాలీలో నిర్వహిస్తున్న అధికారులు, పోలీసులు


బైక్ ర్యాలీలో సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 28 : శాసన సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' పోస్టర్‌ను ఎన్నికల అధికారి ఆవిష్కరించారు. అనంతరం బైక్ ర్యాలీని ప్రారంభించారు. కొత్త బస్టాండ్ మీదుగా కలెక్టరేట్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో కలెక్టర్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం మరోసారి ఓటు నమోదుకు అవకాశం కల్పించిందని, ఈ నెల 31లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. 18 ఏండ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావాలని పేర్కొన్నారు. ప్రజలకు ఓటుపై అవగాహన కల్పించేందుకు 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. బైక్ ర్యాలీలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ అశోక్, డీఆర్వో నగేశ్, రిటర్నింగ్ అధికారి రవీందర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### రేపు నారాయణఖేడ్‌లో

# ప్రజా ఆశీర్వాదసభ

- సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలి
- 'ఖేడ్' ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి


ప్రజా ఆశీర్వాద సభాస్థలిలో కొనసాగుతున్న ఏర్పాట్లు

నారాయణఖేడ్, అక్టోబర్ 28 : ఈ నెల 30న నారాయణఖేడ్‌లో సీఎం కేసీఆర్ పాల్గొననున్న ప్రజా ఆశీర్వాదసభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి కోరారు. బహిరంగ సభకు మధ్యాహ్నం 2 గంటలకు సీఎం కేసీఆర్ హాజరవుతారని, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో సభకు హాజరుకావాలని కోరారు. వెనుకపడిన ప్రాంతంగా ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపడంతోనే నియోజకవర్గం అన్ని రంగాల్లో ఊహించని రీతిలో అభివృద్ధి చెందిందన్నారు. ప్రజా ఆశీర్వాదసభ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను దీవించేందుకు ప్రజలు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

### ఆశీర్వాద సభ కోసం చురుగ్గా ఏర్పాట్లు

నారాయణఖేడ్‌లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాదసభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పట్టణంలోని కరస్‌గుత్తి రోడ్డు ప్రాంతంలో సీఎం సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నారు. భద్రతా అంశాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

- అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కురుమ సంఘం నేతలు

వట్‌పల్లి, అక్టోబర్ 28 : బీఆర్ఎస్‌తో అభివృద్ధి సాధ్యమని, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. మండలంలోని పోతులబోగూడ గ్రామానికి చెందిన కురుమ సంఘం, కాంగ్రెస్ నాయకులు శనివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందోలు నియోజకవర్గంలోని గ్రామాలు సైతం పట్టణ వాతావరణాన్ని తలపిస్తున్నాయన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు.

# బీఆర్ఎస్‌లోకి సింగిల్ విండో డైరెక్టర్


ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న సింగిల్ విండో డైరెక్టర్, నాయకులు

గుమ్మడిదల, అక్టోబర్ 28 : సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతునారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నల్లవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు, గుమ్మడిదల పీఏసీఎస్ డైరెక్టర్ లక్ష్మి, కాంగ్రెస్ నాయకుడు యాదగిరి బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వీరికి బీఆర్ఎస్ కండువా వేసి పార్టీలోకి స్వాగతించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలన చూసి కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. పటాన్‌చెరు గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకుడు రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.